

బకాయిల చుట్టూ రాజకీయం

సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వస్త్ర వ్యాపారులు

- బతుకమ్మ చీరల ఆర్డర్ల రూ.50 కోట్లు విడుదల
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్ల బకాయిలు రూ.270 కోట్లు
- కార్మికుల ఆందోళనలు
- స్పందించిన ప్రభుత్వం
- తమపోరాటమే అంటున్న నాయకులు
- పూర్తిగా చెల్లించాలని బీఆర్ఎస్ డిమాండ్
- సీఎం చిత్రపటానికి కాంగ్రెస్, వస్త్ర వ్యాపారుల క్షీరాభిషేకం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఇప్పుడు బకాయిల చుట్టూ రాజకీయాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రూ.270 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతోపాటు బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిచిపోయాయి. బకాయిలు రాక, ప్రభుత్వ ఆర్డర్లు లేక సిరిసిల్ల మరమగ్గం మూగబోయింది. బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలు కూడా ముందుకొచ్చాయి. ప్రతిపక్ష పార్టీలు నేతన్నలకు మద్దతు తెలిపాయి. వస్త్రోత్పత్తిదారులు మరమగ్గాల అనుబంధ సంఘాలు, కలిసి జేఏసీగా ఏర్పాడి పోరాటానికి తెరలేపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు నేత కార్మికులకు అండగా సిద్ధమయ్యాయి. ఈ క్రమంలోనే బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక జోక్యంతో వస్త్ర పరిశ్రమ ఆందోళనకు బ్రేక్ వేశారు. రూ.50 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కార్మిక సంఘాలు తమకు ఉపాధి కల్పించాలని భిక్షాటన, వంటావార్పు, ధర్నాలు చేపట్టారు. దీంతోపాటు దీక్షలకు పిలుపునిచ్చారు. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సిరిసిల్లలో దీక్షకు సిద్ధమయ్యారు. జిల్లాకు ఎండిన పంటల పరిశీలనకు వచ్చిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం బకాయిలు ఇవ్వాలని వదిలిపెట్టమంటూ హెచ్చరికలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ నేతన్నల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఏ పరిస్థితులు ఎలా ఉన్నా ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన దాదాపు రూ.270 కోట్లలో శుక్రవారం రూ.50 కోట్లు విడుదల చేసింది. మిగతా బకాయిలు త్వరలో చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వస్త్ర పరిశ్రమకు సంబంధించి ఆసాములు, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి ఆందోళనలకు తెరదించారు. బకాయిల్లో రూ.50 కోట్లు విడుదలవడంతో పరిశ్రమకు కొంత ఊరట లభించింది. దీంతోపాటు సర్వశిక్ష అభియాన్‌కు సంబంధించి యూనిఫాం తయారీ బట్టకు రూ.47 కోట్లు ముందస్తుగా చెల్లించారు. నూలు కొనుగోలుకు రూ.14 కోట్లు విడుదల చేశారు. పరిశ్రమ మళ్లీ మొదలవుతున్న క్రమంలో ప్రభుత్వ బకాయిలపై మళ్లీ రాజకీయాలు మాత్రం మొదలయ్యాయి. కార్మిక సంఘాలు తమ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని సంక్షోభ నివారణకు చర్యలు చేపట్టిందని ప్రకటించాయి. బండి సంజయ్ దీక్ష అనగానే బకాయిలు విడుదల చేసినట్లు బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ మాత్రం తమ నాయకుల హెచ్చరికలతో స్పందించిందంటున్నారు. రూ.50 కోట్లు విడుదల చేయడం సబబు కాదని, పూర్తి స్థాయిలో బకాయిలు విడుదల చేయాలని కేసీఆర్, కేటీఆర్ గత ప్రభుత్వ హాయాంలో చేపట్టిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రూ.50 కోట్ల విడుదలపై కాంగ్రెస్ నాయకులు, వస్త్ర వ్యాపారులు వేర్వేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన పాత బకాయిలు విడుదలవడంతోపాటు ఇతర ఆర్డర్లు వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

● ఒడిదుడుకుల ప్రస్థానమేనా?

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో మళ్లీ ఒడిదుడుకుల ప్రస్థానం కొనసాగే పరిస్థితులేనా? కొత్త సర్కారు ఆర్డర్లతో ఆదుకుంటుందా? అనే సందిగ్ధం కొనసాగుతోంది. గతంలో సంక్షోభాలు తలెత్తిన సందర్భాల్లో రెండు మూడు నెలల్లోనే పరిశ్రమ నిల దొక్కుకుని ముందుకు సాగేది. ఆత్మహత్యలు, ఆకలి చావుల నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో 2017లో బతుకమ్మ చీరలు ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది. పూర్తిగా ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడే పరిస్థితి వచ్చింది. దాదాపు 30 వేల మరమగ్గాలపై 15 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందారు. కొత్త ప్రభుత్వంలో ఆర్డర్లు నిలిచిపోవడం, బకాయిలు రాకపోవడంతో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. కార్మిక కుటుంబాల్లో నెలకొన్న ఆందోళనలు, సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలతో ప్రభుత్వం మళ్లీ సర్వశిక్ష అభియాన్ బట్ట ఉత్పత్తి ఆర్డర్లతో భరోసా నింపే ప్రయత్నం మొదలు పెట్టింది. కానీ బతుకమ్మ చీరల జరీ అంచు పోగుల్లో ఉపాధి పొందిన సిరిసిల్ల నేతన్నలకు వస్త్ర సంక్షోభం వెంటాడుతూనే ఉంది. గత ప్రభుత్వ మయాంలో ఆడపడుచులకు అందించిన బతుకమ్మ చీరలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల బట్ట ఉత్పత్తి ఆర్డర్లకు సంబంధించి రూ.270 కోట్ల వరకు సిరిసిల్ల పరిశ్రమకు బకాయిలు పేరుకుపోయాయి. మరోవైపు బతుకమ్మ చీరల ఆర్డర్ల ఉత్పత్తి నిలిపివేయడంతో కార్మికులు వీధిన పడ్డారు. ఇద్దరు కార్మికులు ఆత్మహత్యచేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ పాత పరిస్థితులే పునరావృతం అవుతున్నాయనే ఆందోళనలు పరిశ్రమల్లో ఏర్పడ్డాయి. కొత్త ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్‌కు సంబంధించిన బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వడంతో అగిపోయిన మరమగ్గాలపై మళ్లీ ఉత్పత్తులు మొదలయ్యాయి. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభానికి ఎవరు కారకులనే మాట ఎలా ఉన్నా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీలకు రాజకీయాలకు వేదికగా మారింది. నేత కార్మికులకు అండగా ఉన్నామన్నా భరోసాను కల్పించడానికి పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిల్లో రూ .50 కోట్లు విడుదలవడంతో పారిశ్రామికులు కొంత ఊరటగా భావిస్తున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 20: జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అదనపుకలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం జిల్లా సహకార అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అధికారి కన్వీనర్‌గా 11 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 106 మత్స్యకార సహకార సంఘాలు, 31 డెయిరీ సంఘాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10 రిటైల్ పెట్రోల్ పంపులు ఉన్నాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కిసాన్‌సమృద్ధి కేంద్రాలు, కామన్ సర్వీస్ కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. గంభీరావుపేటలో రైస్ మిల్ కం గోడౌన్ నిర్మించామని, జాతీయస్థాయిలో ఉన్న సీడ్స్ సొసైటీలో సహకార సంఘంలో ఉన్న రైతులు రిజిస్టర్ చేయించుకున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న 106 మత్స్య సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహించి జిల్లా ఫెడరేషన్ ఏర్పాటు చేశామన్నారు. డెయిరీ సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నివేదికలు అందించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థలకు జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్‌లకు అవసరమైన లింకేజ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, జడ్పీ డిప్యూటీ సీఈవో గీతా, డీడీఎ నాబార్డ్ జయ ప్రకాష్ పాల్గొన్నారు.

రామచంద్రస్వామి శోభాయాత్ర

కోనరావుపేట, ఏప్రిల్ 20: మండలంలోని మామిడిపల్లి శ్రీరామచంద్రుడి శోభయాత్ర శనివారం రామాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజనేయ భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వారిపై నిఘా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేంద్రబలగాలతో ఫ్లాగ్ మార్చ్, రూట్‌మార్చ్‌లు నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. 24 గంటలపాటు పెట్రోలింగ్ నిర్వహించాలని, పోలీస్ సిబ్బంది బాధ్యాతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతీరోజు వాహనాల తనిఖీ చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అన్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలు, రౌడీషీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై రాజుగౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ రాకేష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 20: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించామని సిరిసిల్ల ఇన్‌చార్జి ఫైర్ అధికారి టి నర్సింహాచారి తెలిపారు. శనివారం అగ్నిమాపకశాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల ద్వారా అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏప్రిల్ 14, 1944లో విక్టోరియా డాక్ యార్డ్‌లో ఒక నౌకలో అగ్నిప్రమాదం సంభవించిందని, విధి నిర్వహణలో మరణించిన 66మంది అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం వారికి ఈనెల 14న నివాళులు అర్పించామని అన్నారు. వారం రోజుల పాటు బస్టాండ్‌లు, రైస్‌మిల్లులు, పెట్రోల్ బంక్‌లు, అపార్ట్‌మెంట్‌లు, గోదాములు, చిన్నతరహాపరిశ్రమలు, వస్త్రపరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించామన్నారు. చివరిరోజున సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఫైర్‌ఇంజన్ ద్వారా విన్యాసాలు చేశారు.

రమణీయం.. రథోత్సవం

- ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 20: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఉదయం ఐదు గంటలకు రథ ప్రతిష్ఠ, హోమం, బలిహరణం వంటి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు రథంపై స్వామి వారు దర్శనిమిచ్చారు. స్వామి వారిని గ్రామ పుర వీధులు గుండా ఊరేగించారు. ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏకాంత సేవ, నాగవల్లి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గ్రామానికి చెందిన పొన్నాల రాములు అన్నదానం చేశారు. ఎంపీటీసీ అఫెరాసుల్తానా, మాజీసర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సూరనర్సయ్య, నాయకులు మల్లారెడ్డి, అంజాగౌడ్, హనుమండ్లు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కందికట్కూర్ ప్రాథమిక పాఠశాలను శనివారం పరిశీలించారు. గతంలో పాఠశాలలో జరిగిన టీఎల్ఎఫ్ మేళాకు అనివార్య కారణాలతో రాలేదన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అన్నదాతల దిగాలు

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

వీర్నపల్లి, ఏప్రిల్ 20: అకాల వర్షాలకు వీర్నపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు తల్లడిల్లుతున్నారు. మండలంలోని రంగంపేట కొనుగోలు కేంద్రంలోని ధాన్యం వరద నీటికి జంపన్న చెరువులోకి కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన ధాన్యాన్ని రైతులు కుప్పలు చేసుకుంటూ నీళ్లలో నుంచి తీసుకొచ్చారు. సుమారు 4వేల క్వింటాళ్ల ధాన్యం, 2వేల వరకు తూకం వేసిన ధాన్యపు బస్తాలు అకాల వర్షానికి తడిసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో పంట నష్టం వాటిల్లిందని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● రైతులు ఆందోళన చెందవద్దు..

రైతులు ఆందోళన చెందవద్దని, కేంద్రాల్లోని ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా, జవహర్‌లాల్ తండా, రంగంపేటతోపాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. వర్షాలకు తడిసిన ధాన్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యపు బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టాలని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు ఉన్నారు.





తడిసిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు, తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

● గంభీరావుపేటలో తడిసిన ధాన్యం

గంభీరావుపేట: మండలంలో శనివారం ఉరుములతో కూడిన వర్షంతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మరో వైపు కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగింది. మండలంలోని నర్మాలలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ధాన్యం కొట్టుకుపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు.



నర్మాల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్

- రుణమాఫీ చేస్తామంటే నమ్మేదెలా
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కరీంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్ అని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. చొప్పదండి నియోజకవర్గానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో శనివారం చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీలిచ్చిన ఆరు గ్యారెంటీలే పెద్ద బోగస్ అని, మోసాలు చేయడంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ నేతలు మించి పోయారన్నారు. వరికి క్వింటాల్‌కు 500 రూపాయలు ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ 30 వేల కోట్ల రుణమాఫీ చేస్తుందంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

● కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు

కాంగ్రెస్‌ను చూస్తే జాలేస్తోందని, ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పే ధైర్యం కూడా లేదని ఎద్దేవా చేశారు. వానలతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనడానికి 700 కోట్లు ఖర్చు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు ఆ నిధులను సైతం సమకూర్చలేని ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానంటే రైతులెవరూ నమ్మడం లేదన్నారు. జీతాలు, అప్పులు చెల్లించడానికి నెల నెలా 11 వేల కోట్లను సమకూర్చలేక అపసోపాలు పడుతున్నారన్నారు.

● బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు

దేశం అభివృద్ధి చెందాలంటే. పేదల బతుకులు బాగు పడాలంటే మోదీయే ప్రధానిగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీజేపీలోకి వస్తున్న నాయకులకు మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నమ్మక ద్రోహం చేసిందన్నారు.





బీజేపీలో చేరిన చొప్పదండి నియోజక వర్గ నాయకులతో బండి సంజయ్‌కుమార్, సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

● కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో ఏ క్షణం వర్షం పడుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇతర జిల్లాల్లో వానలు పడి ఇప్పటికే వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. ఇప్పటికే రైతులకు తాలు, తరుగుతేమ పేరుతో క్వింటాలుకు ఐదు కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారన్నారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేవన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇచ్చి వరిని కొంటారా లేదా అని ప్రశ్నించారు.

● ఎవరు పునరావాసం పొందారో ఆలోచించాలి

ఎమ్మెల్యేగా ఓడిపోయిన బండి సంజయ్ ఎంపీగా పోటీ చేయడానికి కరీంనగర్ పునరావాస కేంద్రమా అంటు వినోద్‌కుమార్, గంగుల కమలాకర్‌లు అనడానికి సిగ్గుండాలన్నారు. నిజామాబాద్ ఎంపీగా ఓడిన కవితకు ఎమ్మెల్సీ, కరీంనగర్‌లో ఓడిన వినోద్‌కుమార్‌కు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యేగా ఓడిన కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. ఇది పునరావాసం కాదా అని ప్రశ్నించారు. ఎవరు పునరావాసం పొందారో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఇప్పుడు జరుగుతున్నది లోకల్‌కు నాన్ లోకల్‌కు పోటీ అని తెలిపారు. ప్రభుత్వానికి కూల్చాలనే ఉద్దేశం బీజేపీ లేదని, గతంలో బీఆర్ఎస్ నుంచి, ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. తమ పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామన్నామన్నారు. గతంలో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన తర్వాతనే బీజేపీలో చేర్చుకున్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

● రెండో స్థానం కోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ

పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లకు 17 సీట్లు బీజేపీ గెలువబోతున్నదన్నా రు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి పని చేస్తూ డబ్బులు వెదజల్లుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నారన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచే అవకాశాలే లేవన్నారు. ఆ పార్టీకి డిపాజిట్ కూడా రాదన్నాన్నారు. దేశంలో 400 స్థానాలు గెలుచుకుని మోదీ నాయకత్వంలో మూడో సారి కేంద్రంలో అధికారం చేజిక్కించుకుంటామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనాడైనా ప్రజా సమస్యలపై కొట్లాడారా, కాంగ్రెస్ మంత్రి ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసి, 109 కేసులు పెట్టినా భయపడకుండా కేసీఆర్‌ను గద్దెదించే దాకా పోరాటం చేశామన్నారు. హిందూగాళ్లు, బొందుగాళ్లని హేళన చేసిన కేసీఆర్ చెంప చెళ్లమనిపించిన చరిత్ర కరీంనగర్ ప్రజలదన్నారు. కాంగ్రెస్ పార్టీ పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తుంటే వారికి వ్యతిరేకంగా కొట్లాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. దేశంలో, రాష్ట్రంలో గుంటనక్కలన్నీ ఏకమైనా బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోలేవన్నారు.





జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: మహారాష్ట్రలోని దాదర్‌లో ఆదివారం నుంచి 24వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ బాధ్యులు జిట్టవేని శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14న హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హాయ్) నిర్వహించిన మినీ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి టి కారుణ్య, బసరవేని చరణ్‌తేజ, జిట్టవేని సుశాంత్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా పెట అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనుస్‌పాష, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, అశోక్, రాజ్‌కుమార్, భాస్కర్, రాజేందర్, ఐతరవేని శ్రీనివాస్, అనూప్‌రెడ్డి అభినందించారు.



ఎండల తీవ్రతకు చేపలు మృతి

- రూ. 4లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారుల ఆవేదన - అధికారులు ఆదుకోవాలని వినతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 20: ఎండల తీవ్రతకు మండలంలోని టేకుర్తి గ్రామ ముప్పారం చెరువులో చేపలు మృతి చెందాయి. నాలుగు రోజులుగా దంచి కొడుతున్న ఎండ వేడిమికి సుమారు రెండు టన్నుల చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది 2లక్షల పిల్లలు 4లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి చెరువులో వేశారు. చేపలు కూడా 2కేజీల నుంచి 3కేజీల సైజ్ వరకు పెరిగాయని మత్స్యకారులు చెప్పారు. ఏప్రిల్ మొదటి నుంచి ఎండ తీవ్రత పెరిగింది. దీంతో చెరువులో నీరు క్రమంగా తగ్గింది. చెరువు కింద వరి సాగు చేసస్తున్న కొందరు రైతులు రాత్రి వేళ తూము తీయడం వల్ల నీరు బయటకు వెళ్లింది. చెరువులో నీరు పూర్తిస్థాయిలో తగ్గడంతోనే ఎండ తీవ్రతకు చేపలు మృతి చెందాయని, అధికారులు తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.


ముప్పారం చెరువులో మృతి చెందిన చేపలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పాక సురేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ శివారులోని మానేరు వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా తోగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పాక సురేష్ అలియాస్ సూరజ్ (26) దుర్మరణం చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. బంధువుల ఇంటికి కరీంనగర్‌కు వచ్చి సురేష్ శుక్రవా రం రాత్రి 10 గంటల సమయంలో సిద్ధిపే టకు వెళుతుండగా మానేరు వంతెనపై తన బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన సురేష్ తలకు తీవ్ర గాయా లతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పాక జైబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంగాధర, ఏప్రిల్ 20: గంగాధర మండలం మధురానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి 13 తులాల బంగారం, 4లక్షలు ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్నాల ప్రశాంత్ తన కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి కొడిమ్యాల మండలంలో శుభకార్యానికి వెళ్లాడు. శనివారం ఉద యం ఇంటికి చేరుకున్నాడు. తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోని బీరువాను తెరిచి చూశారు. అందులోని సుమారు 13 తులాల బంగారం, 20 తులాల వెండి, 4లక్షల ఆరువేలు కనిపిం చలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి దొంగతనం చేశారని. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

రామడుగు, ఏప్రిల్ 20: మండలంలోని గుండి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన జానపద డప్పు కళాకారుడు ఏగోలపు మల్లేశ్ (54). అతడి భార్య భారతమ్మ (42) బైక్‌పై కరీంనగర్ వైపు వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట్‌కు వెళుతున్న లారీ గుండి గ్రామం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలకు తీవ్రగాలయ్యాయి. స్థానికులు గమనించి కరీంనగర్‌కు తరలించారు.













నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20: రామగుండం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో నాటుసారా తరలిస్తున్న గుగులోతు కిషన్‌నాయక్ అబ్కారీ సిబ్బందికి పట్టుబడ్డాడు. శనివారం న్యూమారేడుపాక చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లూరు తండా వైపు నుంచి బైక్‌పై నాటుసారా తరలిస్తున్న కిషన్‌నాయక్‌ను ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. కిషన్‌నాయక్ వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటు సారా అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మంగమ్మ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ ఖాదిర్, ప్రసాద్, శ్రావణ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 750గ్రాముల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: గోదావరిఖని కాకతీయనగర్‌లోని గంజాయి స్థావరంపై శనివారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఒక ఇంట్లో తనిఖీ జరిపి 750గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌కు చెందిన క్యాటరింగ్ పనిచేసే బీరవేని అభిలాష్(21), హనుమాన్‌నగర్‌కు చెందిన డెలివరీ బాయ్ గుండ్రేటి కార్తీక్(21)లను అరెస్టు చేశారు. అనంతరం వారిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కుక్కను కాపాడబోయి.. విద్యుదాఘాతంతో వివాహిత మృతి

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: కుక్కకు విద్యుత్ వైరు తగిలి కొట్టుకుంటుండగా దానిని కాపాడే ప్రయత్నంలో ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఉంటున్న పల్లపు పద్మ(29)కు భర్త తులసీరాం, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని ఉంది. అదే సమయంలో ఇంటి ముందున్న విద్యుత్ వైరు తెగి కుక్కపై పడటంతో విద్యుత్ షాక్‌తో అది కొట్టుకుంటోంది. దీనిని గమనించిన పద్మ వెంటనే అక్కడకు వెళ్లి కాపాడే ప్రయత్నం చేయగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మృతితో చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

● 18 మంది నుంచి రూ.1.51లక్షలు స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లె శివారులోని ఓ ఫాం హౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని కోరుట్ల, మెట్‌పల్లి ఎస్‌ఐలు కిరణ్‌కుమార్, చిరంజీవి వారి సిబ్బందితో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. ఫాం హౌస్‌లో 18 మంది పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. వారి వద్ద రూ.1.51లక్షల నగదుతో పాటు 18 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. భారీ ఎత్తున పేకాటరాయుళ్ల అరెస్టు కావడంతో మండలంలో చర్చనీయాశంగా మారింది.

● **గంభీరావుపేట:** మండల కేంద్రంలోని నమాజ్ చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు నమాజ్ చెరువు ప్రాంతంలో గాలించగా ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని ఎస్‌ఐ రాంమోహన్ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. 3 వేల 50 రూపాయలు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎవరైనా మానసిక ఆందోళన, ఒత్తిడికి గురైతే వారికి ఫోన్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. టెలీమానస్ పేరుతో 14416 నంబరులో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మానసిక వైద్యుడి సలహాలు, సూచనలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైన వారిని లక్షణాల ద్వారా గుర్తించి మానసిక వైద్య నిపుణుల దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు. చికాకు పడడం, ఆసక్తి కోల్పోవడం, నిద్రలేమి, అపరాధ భావన, నిరాశావాదం, నిస్సహాయత, ఆత్మహత్య చేసుకోవాలని అనిపించడం, ఒంటరిగా ఉండాలనుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు భావించాలన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ వేసవిలో నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల కోచ్‌లనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పది కేంద్రాలలో మే 1నుంచి 31వరకు వివిధ క్రీడాంశాలలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం, కరీంనగర్ నందు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్. 80083 26913 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్


ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు


ముత్తారం, ఏప్రిల్ 20: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన పులిపాక మహేష్ మానేరు ఇసుకను దొంగతనంగా సీతంపేట గ్రామ శివారులో డంప్ చేసి తరలిస్తుండగా ముత్తారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసుకొని అమ్ముకుంటున్నారని సమాచారం మేరకు ముత్తారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూధన్‌రావు తెలిపారు.

గోధూర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20: మండలంలోని గోదుర్‌లో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించున్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

● కొండగట్టులో రేపటి నుంచి ఉత్సవాలు ● 23న చిన్న హనుమాన్ జయంతి


కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, ఏప్రిల్ 20: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హన్‌మాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే హన్‌మాన్ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు మూడు లక్షలకు పైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. దీనికిగాను జయంత్యుత్సవాలకు 41 రోజులు ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా విరమణ చేయడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు.. కొందరు మాలధారణ చేస్తుండగా మరికొందరు స్వామి వారిని దర్శించుకుంటూ మాల విరమణ చేస్తున్నారు.

● ప్రతి ఏటా రెండు ఉత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతుంటాయి. చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41రోజులకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హన్‌మాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హన్‌మాన్ దీక్షాపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు దేవస్థానంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్నహన్‌మాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతన్నాయి. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరుగనుంది.

● కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం కలెక్టర్ యస్మీన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పులూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు ఇతరత్రా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇంకా కొన్ని పనులు కొనసాగుతూనే ఉండగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం నుంచే పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు.

● ఆర్జిత సేవలు రద్దు

ఆదివారం నుంచి 24వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22నుంచి 24వరకు జయంతి ఉత్సవాలు జరుగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. కాగా జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ భక్తులకు, దీక్షాపరులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

● మొదలైన భక్తుల సందడి

చిన్న జయంతికి ముందే కొండకు హన్‌మాన్ దీక్షపరుల రాక మొదలైంది. శనివారం వందలాదాగా హనుమాన్ దీక్షాపరులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంజన్న స్వాములతో పాటు భక్తులు కూడా వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు.


మాల విరమణ కోసం ఏర్పాట్లు


కొండగట్టు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు


సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదాలు

యువకుడి ఆత్మహత్య

● లోన్ యాప్‌లో రుణం తీసుకుని మనస్థాపం


జయవర్ధన్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: కుటుంబ సభ్యులకు తెలియకుండా లోన్ యాప్‌లో రుణం తీసుకుని ఆ తరువాత మనస్థాపంతో గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన గాలిపెల్లి జయవర్ధన్ (24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడు గాలిపెల్లి తిరుపతికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. చిన్న కుమారుడు జయవర్ధన్ ఐటీఐ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. జయవర్ధన్ తన ఆర్థిక అవసరాల నిమిత్తం తల్లిదండ్రులకు చెప్పకుండా లోన్‌యాప్ ద్వారా రూ.31వేలు అప్పుగా తీసుకున్నాడు. తరువాత తండ్రి తిరుపతికి తెలిపాడు. తాను డబ్బులు చెల్లిస్తానని తిరుపతి కుమారుడితో పేర్కొన్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. తల్లి గమనించి ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. జయవర్ధన్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

● విధులపై నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు(జీహెచ్ఎం, గ్రేడ్-2) పి రాజాభాను చంద్రప్రకాష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(వరంగల్) కె సత్యనారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజాభాను చంద్రప్రకాష్ ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ కింద కొంత మంది ఉపాధ్యాయుల సెలవు జీతాలు చెల్లింపులకు సంబంధించి 10,07,165 రూపాయలు ట్రెజరీకి జమచేయలేదని, డీడీవోగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కొందరు ఉపాధ్యాయులు తమకు రావాల్సిన నిధుల విషయంలో నష్టం జరిగిందని, న్యాయం చేయాలని జిల్లా విద్యాశాధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ప్రధానోపాధ్యాయుడు కూడా తనకు ఆ నిధులకు సంబంధం లేదని, దానికి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి డబ్బులు కాజేసినట్లు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాధికారి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య నేతృత్వంలో ఈ నెల 5న ముగ్గురితో కూడిన కమిటీని నియమించి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై విచారించిన కమిటీ జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సస్పెండ్ అయిన రాజాభాను చంద్రప్రకాష్ తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కావడం గమనార్హం.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు : డీఐఈవో

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలను కళాశాలలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఐఈవో కార్యాలయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలపై చర్చించారు. ఫలితాలు, ప్రవేశాలకు సంబంధించిన ప్రచారాలను చేసుకునే ముందు విధిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసే వరకు ముందస్తు అడ్మిషన్లను తీసుకోవద్దన్నారు. వేసవి సెలవులను మే 31వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించినందున ఎట్టి పరిస్థితిలో కళాశాలల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. క్వాలిఫై లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని సూచిస్తూ ఇతర నిబంధనలపై కళాశాలల యాజమాన్యాలతో చర్చించారు. సమావేశంలో బాఐఈవో కార్యాలయ పరిపాలనాధికారి సుధాకర్, ప్రైవేట్ కళాశాలల తరుపున మహిపాల్‌రెడ్డి (ఎస్సీజేసీ), మునీందర్ (సాన్వి), అంజిరెడ్డి (రెసొనెన్స్), నాగార్జున్‌రెడ్డి (ఎస్ఆర్), జగన్మోహన్‌రెడ్డి (శ్రీచైతన్య) పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ విద్యానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్తు పైనుంచి కిందపడి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చంప జిల్లా జంజిగిరికి చెందిన 18 నెలలు వయస్సున్న రాహీ కుర్రే తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రెండో టౌన్ పోలీసులు తెలిపారు. విద్యానగర్‌లో భవన నిర్మాణంలో మేస్త్రీగా పనిచేస్తున్న రవికాంత్ శనివారం ఉదయం తన కొడుకుని వెంటతీసుకుని భవనం నిర్మాణం పనులకు వెళ్లాడు. కొడుకును రెండో అంతస్తులో పడుకోబెట్టి అక్కడే పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో కొడుకు కోసం తండ్రి వెదకగా కనిపించలేదు. కిందకు వెళ్లిచూడగా తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ.88.49 లక్షల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్‌లో శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తుల వద్ద రూ. 88 లక్షల 49 వేల నగదు పట్టుబడింది. రాజీవ్ చౌక్‌లో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన ఉప్పుల రాఘవాచారి, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సూరజ్ రమేష్‌ల వద్ద 71 లక్షల నగదు పట్టుబడింది. ఒక జ్యువెల్లరీ షాపునకు చెందిన నగదును వీరిద్దరూ బైక్‌పై బ్యాగ్‌లలో తీసుకువెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన అంకిత్ తివారి వద్ద 2లక్షల 60 వేల నగదు, ఇందిరాచౌక్ వద్ద తనిఖీలలో సుభాష్‌నగర్‌కు చెందిన దామెర అరుణ్‌కుమార్ వద్ద 14 లక్షల 89 వేల నగదు పట్టుబడింది. ఈ డబ్బులు ఒక ఎలక్ట్రానిక్ షోరూంకు చెందినవిగా సమాచారం. మొత్తం 88 లక్షల 49 వేల రూపాయలు సీజ్ చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. 10 లక్షలపైగా పట్టుబడిన నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు, 10లక్షలలోపు నగదును జిల్లా మానిటరింగ్ కమిటీకి స్వాధీనం చేశామని ఏసీపీ తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించిన రశీదులు, ఇతర ఆధారాలు చూపించిన తరువాత నగదును రిలీజ్ చేస్తారని తెలిపారు.



సీజ్ చేసిన నగదును చూపుతున్న ఏసీపీ నరేందర్

సుల్తానాబాద్‌లో భారీ వర్షం

- తడిసిన ధాన్యం
- కుప్పలను కాపాడుకోవడానికి రైతుల ఇబ్బందులు



సుల్తానాబాద్ శాసితినగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు, ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు


కనుకులలోధాన్యంపై వడగళ్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ ప్రాంతంలో శనివారం అరగంట సేపు భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పంటపొలాలు దెబ్బతినడమే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న కుప్పలు తడిసిపోయాయి. ఉదయం పది గంటల తర్వాత నుంచి ఎండ ఉన్నా ఒక్కసారిగా వర్షం పడ డంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. సుల్తానాబాద్‌పట్టణంలోని మార్కెట్ యార్డులో, శాస్త్రినగర్, కాట్నపల్లి, నర్సయ్యపల్లిలోని కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఆయా గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలు కూడా కొంత మేర దెబ్బతిన్నాయి. గొలుసులతో కూడిన వరి నేలకు రాలింది. అయితే అకాల వర్షం రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ కుప్పలను కాపాడుకోవడానికి కవర్లను కప్పుకున్నారు. సుల్తానాబాద్, కాట్నపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్ తదితర గ్రామాల్లో మాత్రమే వర్షం పడింది. అంతకుముందు కనుకుల గ్రామంలో వడగళ్ల వాన పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కుప్పలు ఆరబోసి ఉంచగా ఒక్కసారిగా వడగళ్ల వాన పడడంతో ధాన్యం దెబ్బతింది. అకాల వర్షంతో రైతులు ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి కొర్రీలు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మహాలక్ష్మి

గన్నేరువరం, ఏప్రిల్ 20: మండలంలోని గుండ్లపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని టి.కారుణ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-12 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని దాదర్‌లో జరిగే 17వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నటు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, పీఈటీ జ్యోతి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు హన్మండ్ల భాస్కర్, ఆర్‌సీఓ గౌతంరెడ్డి విద్యార్థిని అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన పనులు చేయడానికి సర్పంచులు అప్పులు చేశారన్నారు. ఇప్పుడు అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం సర్పంచులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన చెక్కులు సైతం తిరిగి వచ్చాయన్నారు. కేటీఆర్ ప్రాతినిథ్యం వహించిన మండలాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో లోక్‌సభ ఎన్నిక లలో పోటీ చేసి నిరసన తెలుపుతామని అన్నారు. మాజీ సర్పంచులు గట్టు మల్లారెడ్డి, బిల్లవేని పర్శరాం, కట్ట వెంకటరెడ్డి, ముస్కు మల్లయ్య, కూనబోయిన భాగ్యలక్ష్మి, కేతిరెడ్డి అనసూయ, మంద సుశీల, మేఘలవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాసమూర్తి వైఖరిపై మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు విన్నవించడానికి వెళ్లగా ఎంపీడీవో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ప్రజల కోసమే తాము పనిచేశామని, స్వలాభం కోసం చేయలేదని అన్నారు.


నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

బకాయిలు పూర్తిగా విడుదల చేయాలి



క్షీరాభిషేకం చేస్తున్న జేఏసీ సభ్యులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు గత ప్రభుత్వంలోని బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని, నేతన్నలకు నిరంతరం ఉపాధి కల్పించాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ కన్వీనర్ పంతం రవి డిమాండ్ పెండింగ్‌లో ఉన్న బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.50కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహం ఎదుట వస్త్రపరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత పవర్‌లూం కార్మికులను ఆదుకునే విధంగా ప్రభుత్వ ఆర్డర్‌లను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు ఇవ్వాలన్నారు. సిరిసిల్ల బీజేపీ నాయకులు బండి సంజయ్ ద్వారానే ప్రభుత్వం దిగివచ్చిందని చెప్పకోవడం సిగ్గు చేటన్నారు. ఇక్కడి కార్మికుల, ఆసాముల పోరాటాలను కించపరిచే విధంగా మాట్లాడడం చాలా దుర్మార్గమన్నారు. వాస్తవానికి బీజేపీ అధికారంలోకి వచ్చిన నుంచి దేశవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ గురించి పార్లమెంట్‌లో ఏనాడూ మాట్లాడని ఎంపీ బండి సంజయ్‌కుమార్ విధానాలను ఇక్కడి కార్మిక వర్గం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఇక్కడి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. బండి సంజయ్ కుమార్ గత ఐదు సంవత్సరాల కాలంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు ఏం చేశారో బీజేపీ నాయకులు బహిరంగంగా చర్చలకు రావాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన పాపాలను ప్రక్షాళన చేసే విధంగా నూతన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేసి పెండింగ్ బకాయిలను విడుదల చేయడం హర్షనీయమన్నారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, జేఏసీ సభ్యులు మండల సత్యం, వెల్దండి దేవవాస్, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, వెల్దండి శంకర్, తాటి పాముల దామోదర్, పిస్క మధు, గౌడరాజు, గోవిందు రవి, మల్లేశం , బండారి అశోక్, యెల్లె లక్ష్మీనారాయణ, వేముల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న మోదీ

- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 20: మోదీని మరోసారి గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం వస్తే దేశంలో నియంతృత్వం పెరుగుతుందని, ఉత్తర భారతంలో మోదీని పెద్ద ఎత్తున అడ్డుకుంటున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ఇస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల్లో గత సీఎం అత్తగారి ఊరని హామీ ఇచ్చి అమలు చేయని అసమర్థుడు బీఆర్ఎస్ ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. సిరిసిల్లకు రావాల్సిన టెక్స్‌టైల్ పార్కును వరంగల్‌కు తరలించిన అసమర్థుడు వినోద్ కుమార్ అన్నారు. వినోద్‌కుమార్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం వస్తే దేశంలో నియంతృత్వం పెరుగుతుందని, ఉత్తర భారతదేశంలో మోదీని పెద్ద ఎత్తున అడ్డుకుంటున్నారని అన్నారు. మన దగ్గర దేవుడిపేరుతో సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తాను హిందువునేనని వేములవాడ రాజన్న క్షేత్రంలో లిగోధ్రువ పూజలో పాల్గొంటానని అన్నారు. ఫెడరల్‌గా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చినవి కాకుండా పదేళ్లలో ప్రత్యేకంగా పార్లమెంట్ నియోజకవర్గానికి ఏమైనా తెచ్చావా అని బండి సంజయ్‌ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రసాద్ స్కీమ్ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న క్షేత్రాలకు నిధులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఐదు సంవత్సరాల్లో గ్రామాలకు ఎన్ని సార్లు వచ్చారన్నారు. తాను మాట్లాడితే పొన్నం ప్రభాకర్‌కు మతిస్థిమితం లేదని కొంత మందితో మాట్లాడించారన్నారు. ఎవరికి మతిస్థిమితం ఉందో ఎబిలిటి టెస్ట్ చేద్దామని సవాల్ విసిరారు. మోదీ తెలంగాణ ఏర్పాటును అవమానపరిచారని, అర్ధరాత్రి తలుపులు మూసి రాష్ట్రం ఇచ్చారని అమరవీరులను అవమానపరిచారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదన్నారు. అంతకుముందు నియోజకవర్గంలో పార్టీ గెలుపుపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

మతం పేరిట ఓట్లు దండుకునే యత్నం

బీజేపీకి ప్రజాదరణ లేదని, ఏం చేయాలో అర్థంకాక మతం పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనవంతులు, పెట్టుబడిదారులు డబ్బుల వర్షం కురిపించిన లొంగిపోకుండా, వెనుకడుగు వేయకుండా తన గెలుపుకు కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీని ఇవ్వాలని కోరారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నంతో కలిసి సీఎంతో చర్చించామని, త్వరలోనే సమస్యల పరిష్కారం అవుతాయని అన్నారు. బతుకమ్మ పండుగ అంటే ప్రజలకు ఎప్పటి నుండో తెలుసునని కవితనే బతుకమ్మను పుట్టించినట్లు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, ఆరెపల్లి మోహన్, వెలిచాల రాజేందర్‌రావు, జడ్పీటీసీ నాగం కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 20: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారం రోజుల్లో చోటు చేసుకున్న సైబర్ నేరాల వివరాలను వెల్లడించారు. వారంత రోజుల్లో సైబర్ నేరగాళ్లు పలువురిని నమ్మించి రూ.1.81 లక్షలు మోసం చేశారన్నారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సిరిసిల్ల పట్టణంలోని ఓ బాధితుడికి కాల్ రావడంతో వెంటనే వివరాలతోపాటు ఓటీపీ చెప్పాడని, రూ.49,500 వరకు సైబర్ నేరగాళ్లు కాజేశారని అన్నారు. వేములవాడ పట్టణంలోని ఓ బాధితడికి ఓ యాప్ ద్వారా లోన్ ఇస్తామన్నారని, ఓటీపీ చెప్పడంతో రూ.40,600 కాజేశారని అన్నారు. కోనరావుపేటలో ఓ బాధితుడికి వాట్సప్ మెసేజ్ రావడంతో పార్ట్‌టైం జాబ్ కోసం పేరిట రూ.70వేలు లాగేసుకున్నారన్నారు. ముస్తాబాద్‌లో ఓ బాధితుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ధని అనే ఫైనాన్స్ లింక్ ఓపెన్ చేయగా రూ.లక్ష లోన్ మంజూరైందని మెస్సెజ్ వచ్చిందని, ప్రాసెసింగ్ చార్జీల పేరిట రూ.23 వేలు కాజేశారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని, గుర్తుతెలియని కాల్స్ వస్తే స్పందించవద్దని అన్నారు. వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

'వెలిచాల'కే టికెట్ ఇవ్వాలి

సిరిసిల్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు సేవలు అందించిన కుటుంబం, వెలిచాల రాజేందర్‌రావుకు కరీంనగర్ ఎంపీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు కోరారు. శనివారం సిరిసిల్ల విలేకరులతో మాట్లాడారు. వెలిచాల రాజేందర్‌రావు కుటుంబం కాంగ్రెస్‌తో ముడిపడి ఉందని, రాజేందర్‌రావుకు టికెట్ ఇస్తే అధిక మెజార్టీతో గెలుస్తారని అన్నారు. రాజేందర్‌రావుకు టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు.

'ఓ తండ్రి తీర్పు' లఘుచిత్రానికి పురస్కారం



కిరణ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20: సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, విమర్శకుడు చిటికెన కిరణ్‌కుమార్ రచించిన ఓ తండ్రి తీర్పు లఘు చిత్రం హైదరాబాద్‌కు చెందిన పిన్ టీవీ సంస్థ నిర్వహించిన లఘు చిత్ర పోటీల్లో పురస్కారం అందుకుంది. శ్రీరామదూత ఫిలిం మేకర్స్ పతాకంపై చిట్టా రాజేశ్వర్‌రావు, చిట్టా అపూర్వ ర్మించిన ఈ చిత్రానికి ఐదు ప్రభుత్వ నంది అవార్డులు అందుకున్న గాదం శెట్టి ఉమామహేశ్వర్‌రావు దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి గతంలోనే ఇంటర్నేషనల్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు లభించింది.

రైతుల ఆందోళన

కోనరావుపేట, ఏప్రిల్ 20 : మండలంలోని మర్తనపేట శివారులోని సరస్వతి రైస్ మిల్లులో వే బ్రిడ్జిలో ధాన్యం తూకంలో మోసం జరిగిందంటూ రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మారం గ్రామానికి చెందిన ఎదురుగట్ల మహేశ్ అనే రైతు సరస్వతి మిల్లులో విక్రయించేందుకు శుక్రవారం ధాన్యాన్ని తీసుకెళ్లాడు. నాలుగు ట్రాక్టర్లతో తీసుకెళ్లగా మొత్తం 65 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 49 క్వింటాళ్ల ధాన్యం చూపించింది. రెండు ట్రాక్టర్లలో వెయిట్ తక్కువ రావడంతో నిర్వాహకులను బాధిత రైతు ప్రశ్నించాడు. వారు దురుసుగా ప్రవర్తించారని రైతు వాపోయాడు. శనివారం మరి కొంతమంది రైతులతో కలిసి మిల్ నిర్వాహకులను ప్రశ్నించగా మర్తనపేట జీపీ సీసీ ఫుటేజీ పరిశీలించారు. తప్పు జరిగిందని ఒప్పుకొని రైతుకు జరిగిన నష్టాన్ని భర్తీ చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని, మిల్లుపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లోకి చెక్కపల్లి మాజీ సర్పంచ్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 20: చెక్కపల్లి మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్ రెడ్డి బీసీ శాఖ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు 200 మంది గ్రామస్థులతో బైక్‌లపై ర్యాలీ చేపట్టారు. విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని మున్నూరుకాపు సంఘం జిల్లా అడహక్ కమిటీ సభ్యుడు అగ్గి రాములు అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. మండల అధ్యక్షుడు యాస తిరుపతి, నాయకులు పడిగెల రాజు, ల్యాగల బాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 20: ఈ నెల 27న వేములవాడలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాజన నేత మందకృష్ణ మాదిగ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా కో కన్వీనర్ శ్రీనివాస్ మాదిగ, బేస్ కుమార్ మాదిగ, నాయకులు చంద్రమౌళి, భగవంతం, రాజం, మహేందర్ పాల్గొన్నారు.

కోనరావుపేట: వేములవాడలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు భిక్షపతి కోరారు. కోనరావుపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కలికోట రవి, ఖానాపూర్ లక్ష్మణ్, బేస్ కుమార్, చంద్రమౌళి, బుల్లె బాబు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడి హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 20: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాలోతు తేజ్యానాయక్ (46) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. తేజ్యానాయక్ ఉదయం ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తేజ్యానాయక్ చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాకు చెందిన తేజ్యానాయక్ పదేళ్ల కిందట మండల కేంద్రంలో స్థిర పడ్డారు. కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడ్డారని తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

చందుర్తి, ఏప్రిల్ 20: చందుర్తి మండలం మల్యాలలోని సాధన పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చెన్నమనేని రాజేశ్వరరావు శనివారం తెలిపారు. విద్యార్థులు రొండి వీరోనిక, లింగాల అశ్రుతను జడ్పీటీసీ నాగం కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అబ్రహం, హెచ్ఎం మమత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు నాయుడి జన్మదినం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి దయాకర్‌రావు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20 : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శనివారం సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే అభివృద్ధిగా భావించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మచ్చ అంజనేయులు, ఎల్లారెడ్డి పేట మండల అధ్యక్షుడు చేట్కూరి నారాయణ, తంగళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి పంజా బాలరాజు, జిల్లా నాయకులు జెట్టి కొమరయ్య, బండారి నారాయణ, ఆరె మల్లేశం, భైరగోని ప్రవీన్, టీఎస్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పార్లమెంటు ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్‌రెడ్డి, నాయకులు దొమ్మాటి లక్ష్మన్, ఎర్రోజు కిషన్, ఎల్లోజి, బాలయ్య, ఇస్మాయిల్, రాజు, తిరుపతి, పోచయ్య దేవేందర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను వేములవాడలో శనివారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు చింతలకోటి రామస్వామి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. దేవయ్య, సుధాకర్, నర్సయ్య, హరీష్, సత్తవ్వ, రజిత, లక్ష్మి, ముత్తయ్య, రాజయ్య, పర్శరాములు, దేవయ్య, వికాస్ తదితరులు ఉన్నారు.

బండి సంజయ్‌ని గెలిపించాలి



వట్టింలలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నేత చెన్నమనేని వికాస్‌రావు కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, శ్రీరామ్‌నాయక్, చంద్రశేఖర్, వెంకటరమణ, సత్యం, గొట్టే రామచంద్రం, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: దేశ అభివృద్ధి కోసం పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎగుర్ల అనీల్ కోరారు. శనివారం వట్టింల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.మండల కార్యదర్శి ముష్కం సంజీవ్, బోగోజు అరుణ్, చంద్రశేఖర్, వెంకటేశ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: మండలంలోని పెద్దలింగాపూర్‌లో జాతీయ ఓటుహక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం రెండో రోజుకు చేరింది. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణ్ బాబు, భవ్యశ్రీ పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20 : ఉపాధ్యాయులుగా పని చేసి పదవీవిరమణ పొందిన వారందరూ సమాజ సేవలో ముందుం డాలని ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం పదవీవిరమణ పొందుతున్న ఉపాధ్యాయులు మల్లారం పురుషోత్తం- మాధవి, జూపల్లి ప్రకాష్‌రావు- పద్మ, ఇట్టిరెడ్డి వీరారెడ్డి- శ్రీదేవి దంపతులను డీఈవో రమేష్‌కుమార్‌తో కలిసి సన్మానించారు. ఎంఈవో రఘుపతి, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మోతీలాల్, భాగ్యరేఖ, శారద, రాజు, చకినాల శ్రీనివాస్, అంజయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కిషన్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, సిరిసిల్ల మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శంకర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నీలిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: ఉపాధ్యాయులు సామాజిక సేవలు భాగస్వాములు కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాడు ఇట్టిరెడ్డి వీరారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. డీఈవో రమేష్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గన్నమనేని శ్రీనివాసరావు, ఎడ్ల కిషన్, ఇంద్రసేనారెడ్డి, గడ్డం శంకర్, లింగయ్య, నీలి శ్రీనివాస్, కూతురు కరుణాకర్ రెడ్డి, దుబ్బాక ప్రభాకర్, పొన్నాల బాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్, హన్మాండ్లు, శంకర్, పద్మలత, మీనాక్షి, పద్మ పాల్గొన్నారు.

'మెస్ చార్జీలను విడుదల చేయాలి'

గణేశ్‌నగర్, ఏప్రిల్ 20: జిల్లాలోని పాఠశాల, కళాశాల స్థాయి బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సంబంధించిన మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్‌రాజు ప్రభుత్వాన్ని ప్రకటనలో కోరారు. ఆగస్టు నుంచి మెస్ చార్జీలు చెల్లించలేదన్నారు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు సరుకులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మెస్ చార్జీలు చెల్లించాలని ఆయన కోరారు.

మల్కపేటకు చేరుకున్న చిన్న జీయర్‌స్వామి



ఆశీర్వదిస్తున్న చిన్న జీయర్ స్వామి

కోనరావుపేట ఏప్రిల్ 20 : కోనరావుపేట మండలం మల్కపేటలోని రిజర్వాయర్ గుట్ట ప్రాంతంలో నిర్మించిన రామాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా చిన్న జీయర్‌స్వామి శనివారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. ఆదివారం నిర్వహించనున్న ధ్వజస్తంభ, ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. చల్మెడ ఆస్పత్రి చైర్మన్ లక్ష్మీనర్సింహారావు, రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20: విశ్వనాథస్వామి దేవాలయానికి చెందిన భూమి ఆక్రమించిన టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో శనివారం ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో విశ్వనాథ స్వామి దేవాలయానికి చెందిన దాదాపు కోటి రూపాయాల విలువ చేసే మూడు గుంటల భూమి ఆక్రమణకు గురైందని ఆరోపించారు. విచారణ జరపాలని, లే అవుట్ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశామని అన్నారు. లే అవుట్ రద్దు చేయాలని అఖిల పక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మూడు నెలలుగా ఉద్యమించడతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ విచరణ జరిపి అక్రమ లే అవుట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని అన్నారు. మోకమీదికి వెళ్లకుండా కాగితాలతోనే లే అవుట్ ఇచ్చిన మున్సిపల్ టౌన్ అధికారి అన్సారీని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, రాష్ట్ర నాయకుడు చిట్యాల మధు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, కార్మిక సంఘం నాయకుడు సోమ నాగరాజు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా చూడాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 20 : గ్రామాలలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారులు చిరంజీవి, చైతన్య అన్నారు. వీర్నపల్లి, గర్జనపల్లి ఆరోగ్య ఉప కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తహీనత కలిగిన వారికి పౌష్టికాహారాన్ని అందించేలా చూడాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక, ఏఎన్ఎంలు ఉన్నారు.

వినియోగదారుల సంక్షేమమే లక్ష్యం

ముస్తాబాద్, ఏప్రిల్ 20 : వినియోగదారుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని జిల్లా సహకార సంఘం సేల్స్ మేనేజర్ శరణజిత్ అన్నారు. మండలంలోని పోతుగల్ సహకార పరిధిలోని మోహినికుంటలో పెట్రోల్, డీజిల్ సేవలను అందించేందుకు బంకును ప్రారంభించారు. పోత్గల్ సహకార సంఘం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో వీర హనుమాన్ విజయయాత్ర

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20: హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో శనివారం సాయంత్రం వీర హనుమాన్ విజయ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు చేపూరి అశోక్, బూర విష్ణువర్ధన్, కౌన్సిలర్లు బొల్గం నాగరాజుగౌడ్, గూడూరి భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట, ఏప్రిల్ 20: కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపై మాజీ మంత్రి ఆనందరావు, చల్మెడ ఆసుపత్రి చైర్మన్ లక్ష్మీనరసింహారావు కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ న్యాయ శాఖ మంత్రి చల్మెడ ఆనందరావు, చెలిమెడ లక్ష్మీనరసింహారావు, చెలిమెడ రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కిరణ్‌మయి, రాజ్యలక్ష్మి, సునీల, మధుసూదన్‌రావు, కవిత, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మాజీ సర్పంచ్ ఆరే లత, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20 : వస్త్ర పరిశ్రమకు చెందిన బకాయిలు రూ.50 కోట్లు విడదలపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం కాంగ్రెస్ చేనేత సెల్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపెల్లి సత్యం, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, కౌన్సిలర్లు వేముల రవి, కుడికాల రవికుమార్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, రోజ, నాయకులు గుజ్జె రమేష్, పిష్క మధు, కత్తెర దేవదాస్, దొంత దేవదాస్ పాల్గొన్నారు.

బండి సంజయ్ చేసింది శూన్యం



మాట్లాడుతున్న అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు, కార్మికులకు ఎంపీగా సంజయ్ కుమార్ చేసింది శూన్యం అని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడారు. తమ పోరాటాల ఫలితంగానే బతుకమ్మ చీరల బకాయిలలో రూ.50 కోట్లు విడదలయ్యాయని బీజేపీ నాయకురాలు రాణిరుద్రమ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలు రూ.270 కోట్లు విడదల చేయకపోవడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.వస్త్ర పరిశ్రమకు, కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారన్నారు. మొదటి దఫాగా ప్రభుత్వం రూ.50 కోట్లు విడదల చేసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, కార్యదర్శి కాసర్ల రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు వైద్య శివప్రసాద్, నక్క నర్సయ్య పాల్గొన్నారు.

రూ.50 కోట్లు మాత్రమే విడుదల సరికాదు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 20: బతుకమ్మ చీరల బకాయిలు రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేయడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ అన్నారు. శనివారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి మాట్లాడారు. రూ.50 కోట్లు విడదల చేసి కాంగ్రెస్ నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.3312 కోట్ల ఆర్డర్‌లు ఇచ్చిందన్నారు. సిరిసిల్ల నేత కార్మికులకు నెలకు రూ.25 వేలు వేతనాలు రావాలని కేసీఆర్, కేటీఆం ఆలోచన చేసి బతుకమ్మ చీరలను తీసుకొచ్చారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో జేఏసీ ఏర్పాటు విచారకరమన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల హెచ్చరికలతోనే రూ.50 కోట్లను ప్రభుత్వం విడదల చేసిందన్నారు. ఈ రూ.50 కోట్లు సరిపోవని మొత్తం బకాయిలను విడదల చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులకు 10 శాతం రావల్సిన యారన్ సబ్సిడీ రూ.18 కోట్లు విడదల చేయాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, ప్యాక్స్ చైర్మన్ జెల్లా కిషన్, మున్సిపల్ కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, అన్నారం శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల మురళి, బొల్లి రామ్మోహన్, దార్ల సందీప్, పోరండ్ల రమేష్, సామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, చక్రపాణి

బండి సంజయ్‌ని విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 20: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలో ఉన్న ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను విమర్శించే స్థాయి ఎవరికీ లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్య దర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ లను అమలు చేసేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలే తప్ప బండిసంజయ్‌కుమార్‌పై విమర్శలు చేస్తే ఊరుకోబోమన్నారు. సొంత నియోజకవర్గంలో గెలవలేక పక్క నియోజకవర్గానికి వలస పోయి గెలిచిన మంత్రి పొన్నం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రసాదం పథకం కింద దేవాలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని గత ప్రభుత్వాన్ని ఎంపీ బండి సంజయ్ కోరినా ఆ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పొన్నం ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ నియోజకవర్గానికి ఏం చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. బండి సంజయ్ కుమార్ నియోజవర్గానికి తీసుకొచ్చిన నిధులను ప్రజాహిత పాద యాత్రలో వివరించినట్లు చెప్పారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నరేష్, గజభీంకార్ సంతోష్, గాజుల సదానందం, చింటూ, సందవేణి రాజుయాదవ్, దూడం శివప్రసాద్, సిరిసిల్ల వంశీ, కాంబోజు శ్రీధర్, అసాని లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.